క్లుప్తంగా

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కోవ లక్ష్మి

లింగాపూర్/జైనూర్: లింగాపూర్ మండలంలోని వంజారిగూడ గ్రామంలో ఈనెల 5వ తేదీ నుంచి 12 వరకు నిర్వహించనున్న అఖండ హరినామ సప్త కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. అంతకుముందు జైనూర్ మండలం జామిని గ్రామంలో నిర్వహించిన సప్తాహంలో పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం



రిషికను సన్మానిస్తున్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్‌అర్బన్: నవోదయ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా కేంద్రంలోని హోలీ ట్రినిటీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని జాదవ్ రిషికను సోమవారం జిల్లా కేంద్రంలో పాఠశాల చైర్మన్ అరిగెల నాగేశ్వర్‌రావు శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ నాగేంద్రకుమార్, రాజ్పుత్, మహేశ్, ముషీర్ తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: గ్రామీణ ప్రాంత విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మయూరి విద్యాలయ కరస్పాండెంట్ యాదగిరి అన్నారు. మండల కేంద్రంలోని మయూరి విద్యాలయానికి చెందిన విద్యార్థులు దుర్గం హరిప్రియ, ఆలం చరణ్‌కుమార్ నవోదయకు ఎంపికవడంతో సోమవారం విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు ప్రారంభం



గెర్రెలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దహెగాం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో కొత్త ఆర్థిక సంవత్సరం ఉపాధిహామీ పనులు ప్రారంభించినట్లు ఈజీఎస్ ఏపీవో కల్పన తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్క కూలీకి పని కల్పిస్తామని పేర్కొన్నారు. పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు, నీడ, ఫస్ట్ ఎయిడ్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కూలీలు ఉదయం వేళ పనికి వెళ్లాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్

తిర్యాణి: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈవో అనిల్‌కుమార్ ఆదేశించారు. సోమవారం మండలంలోని కన్నెపెల్లి, భీమారం, తిర్యాణి పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏయే సదుపాయాలు ఉన్నాయనే విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద తప్పనిసరిగా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో వేముల మల్లేశ్, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

'సీవోఈ'లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు



విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

సిర్పూర్(టి): సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని సీవోఈ కళాశాలల్లో ప్రవేశానికి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి తమ సత్తా చాటారు. వారు సాంఘిక సంక్షేమ గురుకులాల సొసైటీ ఆధ్వర్యంలో కొనసాగిస్తున్న సీవోఈ గురుకులాల కళాశాలల్లో ప్రవేశానికి అర్హత సాధించినట్లు సాంఘిక సంక్షేమ గురుకులాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ పి.బాలరాజు తెలిపారు. మండలానికి చెందిన 9 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లా కోఆర్డినేటర్ పి. బాలరాజు, వైస్ ప్రిన్సిపాల్ జి. ఫ్రాన్సిస్, కె.శ్రీధర్, ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సౌకర్యాలు కరువు!



ఎండలో పనులు చేస్తున్న ఉపాధిహామీ కూలీలు

- మండుటెండలో ఉపాధిహామీ కూలీల అవస్థలు
- సదుపాయాలు కల్పించాలని వేడుకోలు

బెజ్జూర్: జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. పనిచేసే చోట కూలీల కోసం టెంట్లు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఎండలోనే కూలీలు పనులు చేస్తున్నారు. కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం లక్షా24వేల జాబ్ కార్డులు ఉండగా, 2లక్షల 48వేల మంది కూలీలు ఉన్నారు. ఇందులో లక్షా74 వేల మంది కూలీలు పనికి వెళ్తున్నారు.

వసతులు కరువు..

ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశంలో వసతుల కల్పనపై అధికారులు దృష్టి సారించక పోవడంతో కూలీలకు అగచాట్లు తప్పడం లేదు. చెరువు పూడికతీత, మట్టి రోడ్లు, కందకాలు, వ్యవసాయ కాలువ పనుల పూడిక, కొత్తగా మట్టి రోడ్ల నిర్మాణం వంటి పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో 22 గ్రామపంచాయతీల్లో గత నెల రోజుల నుంచి వ్యవసాయ పనులు ముగించుకొని వంద రోజుల ఉపాధిహామీ పనికి కూలీలు వెళ్తున్నారు. దాదాపు 2వేల మందికిపైగా కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వారికి పని ప్రదేశంలో కనీసం నీడ, నీటి సౌకర్యం లేదు. పనులు చేపట్టే సమయంలో చిన్నపాటి గాయాలైతే ప్రథమ చికిత్స చేసేందుకు సైతం వీలు లేకుండా పోయిందని కూలీలు వాపోతున్నారు. ఉపాధి డబ్బులు కూడా సకాలంలో అందడం లేదని వాపోతున్నారు.

భానుడి విశ్వరూపం..

ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటుతున్నాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. కూలీలు ఎండ తీవ్రతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎండ తీవ్రంగా ఉండడంతో ఉదయం పూట వెళ్లి పనులు చేస్తున్నారు. ఉపాధి నిబంధనల ప్రకారం కూలీలకు పనిచేసే చోట టెంట్లు ఏర్పాటు చేయాలి. అధికారులు ఎప్పుడో గ్రామాల వారీగా టెంట్లు అందించారు. కానీ ఎక్కడా టెంట్లు వేయడం లేదు. అసలు టెంట్లు ఉన్నాయా.. లేదా కూడా తెలియని పరిస్థితి ఉంది. దీంతో కూలీలు ఎండకు చెట్ల నీడన సేదదీరుతున్నారు. కూలీలే తట్టలు, మంచి నీరు తెచ్చుకుంటున్నారు. అందుకు డబ్బులు చెల్లిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

సౌకర్యాలు లేవు



మేము పక్షం రోజులుగా ఉపాధిహామీ పనులు చేస్తున్నాం. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం కల్పించడం లేదు. కనీసం టెంట్లు కూడా వేయలేదు. దీంతో ఎండలోనే పనులు చేస్తున్నాం. పని చేసే చోట సౌకర్యాలు కల్పించాలి.

– తాకితే జైరాం, చిన్నసిద్దాపూర్

ప్రథమ చికిత్స బాక్స్‌లు లేవు



ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు అందుబాటులో ఉంచాలి. పనులు చేస్తున్న సమయంలో గాయమైతే వెంటనే చికిత్స అందడం లేదు. వడదెబ్బకు గురైనప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– గుర్లే పోచుమెర, ఉపాధిహామీ కూలీ, చిన్న సిద్దాపూర్

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



పెంచికల్‌పేట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



దహెగాంలో..



కౌటాలలో..

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆర్ఐ గోపాల్ ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మద్దతు ధర లభిస్తుందన్నారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బెజ్జూర్ పీఏసీఎస్ అసిస్టెంట్ సెక్రెటరీ సత్యనారాయణ గౌడ్, సిబ్బంది వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

దహెగాం: కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని సహకార సంఘం సీఈవో బక్కయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సహకార సంఘం సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో యాసంగిలో 60వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు లక్ష్యం పెట్టుకున్నామన్నారు. టార్పాలిన్లు, గన్నీ సంచులు, పాడి క్లీనింగ్ మిషన్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ. 2,203, బీ గ్రేడ్‌కు రూ. 2,183 ధర లభిస్తుందన్నారు.

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో సోమవారం యాసంగి పంట వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సహకార సంఘం అధికారి రాజేశ్ మాట్లాడుతూ గురుడుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కౌటాల: మండలంలోని రైతులు వరి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇందారపు పుష్పలత అన్నారు. మండల కేంద్రంలోని గురుడుపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో యాసంగి పంట వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర లభిస్తుందని, మండలంలోని రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించి నష్టపోవద్దని సూచించారు. మండల వ్యవసాయాధికారి రాజేశ్, సహకార సంఘం సీఈవో రాజేశ్, ఏఈవో ఘన్‌శ్యాం, సీసీలు కల్పన, గీత, శంకర్, రైతులు పాల్గొన్నారు.

సిర్పూర్‌లో..



వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రాథమిక సహకార సంఘం బ్యాంక్‌లో యాసంగి వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులు యాసంగిలో పండించిన వరి ధాన్యాన్ని ప్రాథమిక సహకార సంఘం వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఏసీఎస్ సీఈవో రాకేశ్, సిబ్బంది సురేశ్, రైతులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోండి



తిర్యాణి: ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



సిర్పూర్(టి): కవాతు చేస్తున్న పోలీసులు

తిర్యాణి: ప్రతీ ఓటరు తన ఓటుహక్కు నిర్భయంగా వినియోగించుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య అన్నారు. సోమవారం మండలంలోని తలండి, పెరికపెల్లి, నాయకపుగూడ గ్రామాల్లో సీఆర్పీఎఫ్ కమాండెంట్ రాకేశ్‌తో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి నిరోధకులుగా మారిన అసాంఘిక శక్తులకు ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో సహకరించొద్దని పేర్కొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సై చుంచు రమేశ్, సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి..

సిర్పూర్(టి): రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో కొనసాగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ నుంచి బస్టాండ్ ప్రాంతం మీదుగా పలు వీధుల గుండా కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండలంలోని లోనవెల్లి, డోర్‌పల్లి గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌటాల సీఐ సాదిక్ పాష, ఎస్సై దీకొండ రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హనుమాన్ అర్ధమండల దీక్షలు ప్రారంభం

ఆసిఫాబాద్‌అర్బన్: హనుమాన్ జయంతి పురస్కరించుకొని నేడు జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో అర్ధమండల దీక్షలను ప్రారంభించనున్నట్లు ఆలయ అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీక్షల సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, నవగ్రహ పూజ, ఆంజనేయస్వామికి రుద్రాభిషేకం, అష్టోత్తర శ తనామపూజ, అనంతరం దీక్షాపరులకు మాలధారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

కార్మికులకు బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ నుంచి గోలేటి ఎక్స్‌రోడ్ వరకు మూడు షిఫ్టుల్లో కార్మికుల కోసం బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి అన్నారు. గోలేటిటౌన్ షిప్‌లోని జీఎం కార్యాలయంలో సోమవారం జీఎం రవిప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీతోపాటు వివిధ విభాగాల్లో ఇతర ఏరియాల నుంచి రాకపోకలు సాగిస్తూ కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. అన్నివేళలా బస్సు సౌకర్యం లేక ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కైరిగూడ నుంచి ఎక్స్‌రోడ్ వరకు మూడు షిఫ్టుల్లో బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై జీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్యమొగిళి, ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, రాజేష్, దివాకర్, శేషశయన రావు, ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం సింగరేణి సంస్థ 2023– 24 ఆర్థిక సంవత్సరంలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి సాధించిన సందర్భంగా బెల్లంపల్లి ఏరియా ఏఐటీయూసీ నాయకులు జీఎం రవి ప్రసాద్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్టాపనకు ఏర్పాట్లు



ఓంకార ఆశ్రమంలో ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు

- ఖర్జెల్లి ఆశ్రమంలో నేటి నుంచి ఉత్సవాలు

చింతలమానెపల్లి: మండలంలోని ఖర్జెల్లి ఓంకార ఆశ్రమంలో శ్రీరాధాకృష్ణులు విగ్రహాల ప్రతిష్టాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆశ్రమం ప్రాంగణంలో భక్తులకు వసతుల కల్పనకు చర్యలు చేపట్టారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలలో మహాసాధువులు హాజరవుతున్నట్లు తెలిపారు. శ్రీ విష్ణు సేవానందగిరి స్వామి, శ్రీ నారాయణ నందగిరి స్వామి, శ్రీ సచ్చిదానందగిరి స్వామి, శ్రీ సుబ్రహ్మానందగిరి స్వామి, శ్రీ జగదీశ్వరనందగిరి స్వామి, శ్రీ విష్ణుదేవానంద సరస్వతి, శ్రీ చిదానందగిరి స్వామి, శ్రీ సదాశివ నందగిరి స్వామి, శ్రీ శివరామక్రిష్ణ స్వామి, ఆధ్యాత్మిక సేవకులు శ్రీ సత్యమౌళిక, శ్రీ భక్త రాజేశంలు ఉత్సవాలకు హాజరవుతారని పేర్కొన్నారు. వీరు భక్తులకు ప్రవచనాలు బోధిస్తారని తెలిపారు. వీరి చేతుల మీదుగా 4వ తేదీన రాధాకృష్ణుల విగ్రహాల ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భగవత్ భజన, పూజ అనుష్ఠానం, జపం, హోమం, సజ్జన సాంగత్యం ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. హోమం కోసం యజ్ఞశాల, ప్రసాద వితరణకు సోమవారం పనులు పూర్తయినట్లు తెలిపారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రమాదకరంగా ప్రయాణం



కంకర రోడ్డుపై అదుపుతప్పి పడిపోయిన ద్విచక్ర వాహనదారుడు

- ఖమాన రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం
- కంకర పోసి వదిలేసిన గుత్తేదారు
- అదుపుతప్పి కింద పడుతున్న ద్విచక్రవాహనదారులు

వాంకిడి: మండలంలోని ఖమాన రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రహదారి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం వాహనదారుల పాలిట శాపంగా మారుతోంది. ద్విచక్ర వాహనదారులు తరుచూ రోడ్డుపై అదుపుతప్పి పడిపోతున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన ఖమాన రోడ్డు పనులు నత్తనడకన జరుగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. నిర్మాణ పనులు దక్కించుకున్న గుత్తేదారు ఏడాది క్రితమే పనులు ప్రారంభించగా నేటికీ పూర్తి కాలేదు. గత ఫిబ్రవరిలో ఖమాన గ్రామస్తులు రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలని ధర్నా నిర్వహించారు. దీంతో స్పందించిన అధికారులు గుత్తేదారు పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నారు. పనులు ప్రారంభించిన గుత్తేదారు 2.5 కిలోమీటర్ల రహదారి పొడవున కంకర వేసి వదిలేశాడు. రోడ్డుపై పోసిన కంకరపై నామమాత్రంగా నీళ్లు పట్టి, రోలింగ్ చేశాడు. కంకర పోసి సుమారు నెల కావస్తుండటంతో రోడ్డంతా ప్రమాదకరంగా మారింది. ఈ రహదారి గుండా రోజూ వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా ఎవరో ఒకరు నిత్యం కంకరపై జారి పడిపోతున్నారు. సోమవారం మధ్యాహ్నం ఓ ద్విచక్ర వాహనదారుడు ఖమాన నుంచి మండల కేంద్రం వైపునకు వెళ్తుండగా కంకరపై జారి పడిపోయాడు. పదునైన కంకర తేలి ఉండటంతో వాహనాల టైర్లు సైతం పాడైపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

'సింగరేణి కార్మికుల పనివేళలు మార్చాలి'

రెబ్బెన: సింగరేణి సంస్థలో పని చేస్తున్న కార్మికుల పనివేళలను వెంటనే మార్చాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ ఎండల తీవ్రత, ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీంతో కార్మికులు అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. రోజంతా మండుటెండలో పని చేస్తే కార్మికులు వడదెబ్బకు గురై ప్రాణాపాయస్థితికి చేరుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సింగరేణి ఉత్పత్తి కాలం పూర్తయినందున కార్మికుల సంక్షేమం, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పనివేళలు మార్చాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు కార్మికులకు, కాంట్రాక్టు కార్మికులకు విశ్రాంతి ఇవ్వాలని, కార్మికులందరికి ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందించాలని కోరారు. బొగ్గు ఉత్పత్తిపైనే కాకుండా కార్మికుల సంక్షేమంపై సైతం యాజమాన్యం దృష్టి సారించాలని, సింగరేణి వార్షిక ఉత్పత్తి లక్ష్యం పూర్తి చేసినందున కార్మికులందరికి స్వీట్ బాక్సులు అందించాలని కోరారు.

దేవార వినోద్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న దేవార వినోద్

రెబ్బెన: మండలంలోని ఇందిరానగర్‌లో గల కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయ ప్రధాన అర్చకుడు దేవార వినోద్ చేస్తున్న సామాజిక, ఆధ్యాత్మిక సేవలను గుర్తించి శిఖర ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతీలో నంది పురస్కారాన్ని ఆ సంస్థ సభ్యులు అందజేశారు. పేదల కోసం చేస్తున్న సామాజిక కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక సేవలను గుర్తించి నంది పురస్కారాన్ని అందజేశారు.

శివాలయానికి భూమిపూజ

బేల: మండలంలోని సాంగిడి గ్రామ శివారులోని పెన్‌గంగ తీరాన ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో రూ.2కోట్ల వ్యయంతో నిర్మించనున్న శివాలయానికి సోమవారం వేద పండితులు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ నాయకురాలు సుహాసిని రెడ్డిలు వేర్వేరుగా హాజరై నిర్మాణ పనులను ప్రారంభించారు.

నేడు విగ్రహ ప్రతిష్టాపన

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని రిక్షా కాలనీలో శ్రీ సీతారామచంద్ర స్వామి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.